క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



వనపర్తి రూరల్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై జరిగిన వ్యాస రచన పోటీలో మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి పవన్ మండల స్థాయిలో మొదటి బహుమతి, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని అందుకున్నాడు. సోమవారం హెచ్‌ఎం గణేష్‌కుమార్ ఆధ్యక్షతన పాఠశాలలో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని రుద్రమదేవి, గణితశాస్త్ర ఉపాధ్యాయులు సి వరదాచారిని, విద్యార్థి పవన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, జిల్లా చెలిమి సంస్థ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతుల ఆరా..



పాన్‌గల్: ప్రభుత్వం రూ.2 లక్షల లోపు రుణమాఫీ పూర్తి చేసినట్లు ప్రకటించడంతో ఆ లోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ వర్తించకపోవడంతో చాలా మంది రైతులు సోమవారం రైతువేదికకు క్యూ కట్టి, అధికారులతో తమ రుణాలపై ఆరా తీశారు. మండల కేంద్రంతో పాటు దావాజిపల్లి, దొండాయిపల్లి, వెంగళాయిపల్లి, జమ్మాపూర్, మంగ్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు వారి ఆధార్‌కార్డులతో సంబంధిత ఏఈఓతో రుణమాఫీపై ఆరా తీశారు. ఆయా రైతులు తమ రుణాలు రూ.2 లక్షల లోపు ఉన్న మాఫీ వర్తించలేదని, ఎందుకు మాఫీ వర్తించలేదో అనే విషయాలపై ఆరా తీస్తూ మాఫీ వర్తించకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. రుణమాఫీ ఎందుకు వర్తించలేదో సంబంధిత అధికారులు కారణాలు చెబుతుండటంతో ఆయా కారణాలను నివృత్తి చేసుకునే వివరాలను తెలుసుకుంటున్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా సోమవారం ఎయిడ్స్ నివారణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, ఎయిడ్స్ సోకిన వారితో ఎలా ఉండాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు కళాశాలల్లో విద్యార్థులకు ఎయిడ్స్ నివారణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



ఆత్మకూర్: అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి వేలాది సంఖ్యలో విద్యార్థులతో కలిసి గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఇంట్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ఆయా వార్డుల్లోని ప్రజలు తమ తమ ఇళ్ల ముందున్న వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం, మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, మున్సిపల్ మేనేజర్ ఈసుప్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా..



ఆత్మకూర్‌లో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీముబారక్, 25 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నేరవేరుస్తున్నామని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లలో రూ. 500 బోనస్, అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకు వంటగ్యాస్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలను అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, ఇదివరకే రూ.65 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రి, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు పరమేష్, రహ్మతుల్లా, తులసీరాజ్, తుకారాం, చిరంజీవి, వినయ్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా..

బాలకిష్టాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిన్నచాంద్ ఇటీవల అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమయ్యారు. దీంతో బాధితుడిని ఆయన ఇంటికెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని, మెరుగైన వైద్యచికిత్సలకు సహకరిస్తానని భరోసానిచ్చారు.

మా బాధలు తీర్చండి సారూ..



పాఠశాలలో నెలకొన్న సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న విద్యార్థులు

అమరచింత: మా స్కూల్‌లో చాలా సమస్యలు ఉన్నాయి సారూ.. ఉదయం బడికి వస్తే ఆవరణంతో పాటు తరగతి గదులు, వరండాల్లో మద్యం సీసాలను పగులగొట్టి పారవేస్తున్నారు, దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం సారూ అంటూ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నవించుకున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం భూమిపూజకు వచ్చిన ఎమ్మెల్యేతో విద్యార్థులు తమ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంతే కాకుండా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ, తరగతి గది తాళాలు పగులగొట్టి రిజిస్టర్‌తో పాటు బియ్యం సంచులను చిందరవందరగా పాడేశారని ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ సోమవారం ఫిర్యాదు చేసిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడే ఉన్న ఎస్‌ఐ సురేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారని, ఇక ముందు ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి రాకూడదని, రాత్రి వేళలో గస్తీ పెంచాలని ఆదేశించారు.

సమాజహితం కోరే విద్య అందించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్

అమరచింత: సమాజహితం కోరే విధంగా నేటి విద్యా ప్రమాణాలు ఉండాలని, అలాంటి విద్యను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్ అన్నారు. సమాజ హితం కోరుతూ పాదయాత్రను నిర్వహిస్తూ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల, కేజీబీవీని సందర్శిస్తూ నేటి విద్యా విధానాలు, సమాజంలోని మార్పుల గురించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాదయాత్రలో భాగంగా సోమవారం అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 100 రోజుల పాటు 1000 కిలోమీటర్ల మేరకు పాదయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 2న జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాదయాత్ర మొదలైందని, ఈనెల 12 ఉమామహేశ్వర ఆలయానికి చేరుకుని అక్కడ ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ సింగ్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి, కేజీబీవీ ఎస్‌ఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై 'చలో కలెక్టరేట్'



రేమద్దుల నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్ర చేస్తున్న విద్యార్థులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం గ్రామం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది, డీవైఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ మహేష్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడం, తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఒకే దగ్గర బోధన చేస్తుండటంతో ఇబ్బందిగా ఉందన్నారు. గతంలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణం నాణ్యతగా లేకపోవడంతో పనులు నిలిపివేశారు. ఆయా అదనపు గదుల నిర్మాణాన్ని నాణ్యతతో నిర్మించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. పాదయాత్ర జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుమార్, వెంకటేష్, భరత్, డీవైఎఫ్‌ఐ నాయకులు కమలాకర్, భాస్కర్‌గౌడు, ఖాజా, మహేష్, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమకాల్వ ద్వారా 390 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 540 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 55 క్యూసెక్కులు తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వర ప్రసాద్ తెలిపారు.

మినీ వంతెనలు నిర్మించాలి

మానవపాడు: హామీలు ఎన్నికల రోజు వరకే పరిమితమవుతున్నాయి. ఎన్నికల వేళ గ్రామాల్లో నాయకులు హామీలు ఇస్తారూ... వెళ్తారూ రోడ్లు, వంతెనలు నిర్మిస్తామన్నా మాటలు నీటి మూటలుగానే ఉన్నాయి. మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు గ్రామాల్లో మినీ వంతెనలు నిర్మించాలని ఎన్నో మార్లు నాయకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షకాలమే కాదు ఏ కాలమైనా గ్రామాల్లో మిని వంతెనాలు నిర్మించకా తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని తెలిపారు.

బురుదలో ఇరుక్కుపోతున్న వాహనాలు

గ్రామాల్లో వంతెనాలు లేక వాగుల్లో బురదలో వాహనాలు ఇరుక్కుని అవస్థలు పడుతున్నారు. మండలంలోని చెన్నిపాడు, గోకులపాడు గ్రామాల ప్రజలు కొర్విపాడు, చంద్రశేఖర్‌గనర్ గ్రామాల్లోని శివారు ప్రాంతంలో ఉన్న పంట పొలాలకు వెళ్లాలంటే వంతెనాలు లేక నిత్యం రాకపోకలకు అవస్థలు తప్పడం లేదంటున్నారు. పంటలు వ్యవసాయ పొలాల నుంచి తరలించాలంటే అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మినీ వంతెనలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆకాశం మేఘావృతం: రైతుల్లో కలవరం

పాన్‌గల్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను 'ఫెయింజల్' ప్రభావంతో మండలంలో రెండు, మూడు రోజుల నుంచి మబ్బులతో కూడిన వాతావరణం నెలకొనడంతో రైతుల్లో గుబులు మొదలైంది. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో వర్షం కురుస్తోందనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కాంటా చేయడంలో జాప్యం జరుగుతుండటంతో.. ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లను ధాన్యంపై కప్పి ఉంచడం కనిపించింది.

నేలవాలుతున్న వరి పంటలు

వీపనగండ్ల: మూడు రోజులుగా వాతావరణ పరిస్థితుల మార్పుల వల్ల ఈదురు గాలులు వీస్తుండడంతో చేతికి వచ్చిన వరి పంటలు నేల వాలుతున్నాయి. రూ.వేలు ఖర్చు చేసి వరి పంటలు సాగు చేసినా.. చేతికి వచ్చే సమయంలో పంట నేలవారుతుండడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో జూరాల, భీమా, కేఎల్ఐ కాల్వల కింద దాదాపు 8 వేల ఎకరాలలో వరి పంటలను రైతులు సాగు చేశారు.



వీపనగండ్ల శివారులో నేలవాలిన వరిపంట



పాన్‌గల్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులపై కవర్లు కప్పిన దృశ్యం

వరి సాగులో యాజమాన్య పద్ధతులు

వీపనగండ్ల: యాసంగి వరి సాగులో భాగంగా రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మంగళవారం మండల కేంద్రంలో రైతు నేస్తం కార్యక్రమంలో దృశ్య, శ్రవణ పరికరాల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి దాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు రైతువేదికలో ఈ అవగాహన కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని మోట్లంపల్లికి మరాఠి దశరథ్ నవంబర్ 18న ఆత్మకూర్‌కు వస్తుండగా ఫోన్ పడిపోయిందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని స్వాధీనం చేసుకున్నారు.

'అగ్నిపథ్' యువకులకు అవగాహన

పెద్దకొత్తపల్లి: అగ్నపథ్‌కు ఎంపికైన యువకులకు సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి అరుణ్‌రావు మాట్లాడుతూ అగ్నిపథ్ కోసం ఎంపికైన యువకులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అనంతరం గ్రామంలో యువకులతో కలిసి రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, దండునర్సింహ, డబ్బ ఎల్లయ్య, రామస్వామి, పాల్గొన్నారు.

ఎంపీ మల్లురవి ద్వంద్వ వైఖరి వీడాలి

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణలో ఎంపీ మల్లురవి ద్వందవైఖరి అవలంభిస్తున్నారని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామాపురంలో దళిత దండు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభలో ఎంపీ మల్లురవి హాజరుకావడం సరికాదన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఎంపీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

అటవీ సంరక్షణకు శ్రద్ధ

కొల్లాపూర్: అటవీ సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ అంశాలపై ఫారెస్టు సిబ్బందికి సోమవారం పట్టణంలోని టింబర్‌డిపో ఎదుట అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లోకి ఇతరులు ప్రవేశించకుండా చూడాలన్నారు. అడవిలో ఉచ్చులు, ఉరులు అమర్చడం, విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. సమావేశంలో అటవీ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

రైతు సాయిరెడ్డిని ఆదుకోవాలి



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: భూ సమస్యను పరిష్కరించి, రైతు సాయిరెడ్డిని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్ కోరారు. గోపాల్‌పేట మండలంలోని ఏదుట్లకు చెందిన రైతు సాయిరెడ్డి అన్నదమ్ముల భూ తగాదాల సమస్యను తహసీల్దార్, ఎస్‌ఐ, కలెక్టర్‌కు వివరించినా పట్టించుకోవడం లేదని సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. ప్రాణాపాయ స్థితిలో జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిరెడ్డిని రైతు సంఘం రాష్ట్ర నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ వెంటనే స్పందించి రైతు సాయిరెడ్డి భూ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కార్యదర్శి పరమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సిగ్గుపడాలి

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతు కలెక్టర్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అధికారులు రైతు సమస్యను పట్టించుకోకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని, కాంగ్రెస్ పార్టీ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. కార్యక్రమంలో తిరుపతియాదవ్ వెంకటేశ్వర్‌రావు, శంకరయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించకపోవడం బాధాకరం



ఎస్టీ ఆశ్రమ పాఠశాల గేటు వద్ద టోల్‌ఫ్రీ నెంబర్ అంటిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు కనీస వసతులు కల్పించకపోవడం బాధాకరమని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్, కార్యక్రమం ఇన్‌చార్జ్ శివప్రసాద్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్వీ గురుకుల పాఠశాలల బాట కార్యక్రమంలో భాగంగా మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ క్యామ వాణి తదితరులతో కలిసి వారు మండలంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాల తదితర వాటిని వారు పరిశీలించారు. సమస్యలు వస్తే చెప్పాలని బీఆర్‌ఎస్వీ టోల్‌ఫ్రీ నెంబర్‌ను పాఠశాలలకు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందించే కోడిగుడ్లు, యూనిఫాం తో పాటుగా నిత్యావసర సరుకులు సక్రమంగా అందక విద్యార్థులు తీవ్రంగా ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. సకాలంలో బస్సులు రాకపోవడంతో మోడల్ పాఠశాలకు వచ్చే విద్యార్థులు రాత్రి 7 దాటిన ఇంటికి చేరుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. డీఎం, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని విద్యార్థులు చెప్పడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అమరేందర్, లక్ష్మణ్ గౌడు, శివప్రసాద్ గౌడ్, లక్ష్మీకాంత్, అఖిలేందర్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దంపతులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో నారికేళ గురుస్వామి గోద అంజనేయస్వామి గృహంలో అయ్యప్పస్వామి పదునెట్టాంబడి పూజ కనులపండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 18 మెట్లను పూలు, పండ్లు, గంధం, కుంకుమతో అందంగా అలంకరించి దీపాలు వెలిగించారు. మెట్లపై స్వామివారిని ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం కళశ పూజ కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలుగ్రామాల నుంచి 20 మంది గురుస్వాములు, సుమారు 300 మంది మాలధారులు పూజలో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వాసంతి దంపతులతో పాటుగా వారి కుమార్తె ప్రత్యూష స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాలధారులకు బిక్ష, భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

ఆత్మకూర్: హరిహరపుత్ర అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ఈనెల 14వ తేదీన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి భారీ ఏర్పాట్లను చేపడుతున్నట్లు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, గాడి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం స్థానిక అయ్యప్ప మాలధారులతో సమావేశమై ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 12, 13, 14వ తేదీల్లో ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యహావాచం, గోపూజ, యాగశాల ప్రవేశం, పంచగవ్య, ధ్వజారోహనం, నవగ్రహ, సర్వతోభద్ర, మండళయోగిని, వాస్తుపూజ, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, సర్వదేవత మండప ఆరాధన, తదితర పూజ కార్యక్రమాలను ప్రముఖ వేదపండితులు గోపాలకృష్ణ, పవన్‌కుమార్‌శర్మ, జ్యోషిగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ ఉదయం 9:59 గంటలకు అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రమణ్య, పార్వతిపరమేశ్వర, నంది, నాగ, సీతారామలక్ష్మణ, ఆంజనేయ, నవగ్రహ, సంతాన నాగులు, లక్ష్మీవేంకటేశ్వర, సరస్వతి, వీరబ్రహ్మేంద్రస్వామి, ధ్వజశిఖర ప్రతిష్ఠాపన జరుగుతాయన్నారు. ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదాన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని భక్తులు వేలాదిగా తరలిరావాలని కోరారు.

అయ్యప్ప ఆలయానికి రోడ్డు నిర్మించండి

అయ్యప్పకాలనీలో రూ.3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయానికి వెళ్లేందుకు రోడ్డును నిర్మించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి నిర్వాహకులు, మాలధారులు వినతి పత్రం అందజేశారు. మేయిన్ రోడ్డు నుంచి కోర్టు ముందుగా ఆలయం వరకు అర కిలోమీటర్ మేర బీటీ లేదా సీసీరోడ్డు నిర్మించాలని, ప్రతిష్ఠాపనకు హాజరుకావాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎస్టీడీ శ్రీను, మెకానిక్ శ్రీను, జిన్నారం శ్రీను, కూరగాయల రఘు, దివాకర్, భరత్, తోటరవి, అనిల్, గోవర్ధన్, ఎల్లయ్య, వెంకట్రాములు, నాగరాజు, మాలధారులు ఉన్నారు.

మరమ్మతుకు నోచుకోని స్కీం బోర్లు



వ్యవసాయ బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న తండావాసులు

- శాగాపూర్‌తండాలో అందని మిషన్ భగీరథ నీరు
- వ్యవసాయ బోర్ల నీరే దిక్కు...
- ఇబ్బందుల్లో తండావాసులు

పాన్‌గల్: క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో తండావాసులకు తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలోని శాగాపూర్‌తండాలో ఉన్న రెండు స్కీం బోర్లు చెడిపోయి 25 రోజులు అవుతున్నా మరమ్మతుకు నోచుకోకపోవడం, తండాకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీరు పైపులైన్ల ధ్వంసంతో మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తండాలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నట్లు తండావాసులు వాపోతున్నారు. ఒక పక్క స్కీం బోర్లు మరమ్మతుకు నోచుకోకపోవడం, మరోపక్క మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తండాలో నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు స్కీం బోర్లను మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తండావాసులు వాపోతున్నారు.

పైప్‌లైన్ ధ్వంసంతోనే..

తండాకు సరఫరా అయ్యే మిషన్ భగీరథ పైపులైన్ కొల్లాపూర్ సమీపంలో ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచింది. దీంతో పాటు స్కీం బోర్లు రిపేరుకు రావడంతో నీటి ఇబ్బంది ఏర్పడింది. స్కీం బోర్లను మరమ్మతు చేయించడంతో పాటు మిషన్ భగీరథ పైపులైన్ సమస్యను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించి, తండాకు నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

– అనుదీప్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ